సాక్షి జగిత్యాల

సోమవారం । 1 । జనవరి । 2024



జగిత్యాల జిల్లాకేంద్రంలో కొత్త సంవత్సరం వేడుకల్లో..

న్యూస్‌రీల్

ఆరు గ్యారంటీల్లో యువ వికాసం మరిచారు



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాలరూరల్: ఆరు గ్యారంటీల్లో యువ వికాసం మరిచారని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం జగిత్యాల తహసీల్దార్ కార్యాలయంలో 71మంది ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని, అది కేవలం బీఆర్‌ఎస్ పాలనతోనే సాధ్యమైందని తెలిపారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, ప్రజాతీర్పును గౌరవించాలని సూచించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు ధాన్యానికి రూ.500 బోనస్ కల్పించాలని అన్నారు. ప్రతి మండలానికి గురుకులం ఏర్పాటు చేయాలని, నిరుద్యోగులకు భృతి ఇస్తామన్న హామీలు నెరవేర్చాలని పేర్కొన్నారు. కార్యక్రమంలోనాయకులు గట్టు సతీష్ దావా సురేశ్, ఆర్‌ఐ రాజేందర్ పాల్గొన్నారు.

నృసింహుడిని దర్శించుకున్న మాజీ మంత్రి



పూజలు చేస్తున్న మాజీ మంత్రి కొప్పుల

ధర్మపురి: శ్రీలక్ష్మీనృసింహస్వామిని మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ ఆదివారం దర్శించుకున్నారు. ముందుగా ప్రధాన ఆలయంలో పూజలు చేశారు. కొప్పులకు ఆలయ అర్చకులు, సిబ్బంది స్వామివారి శేషవస్త్రం కప్పి చిత్రపటం, ప్రసాదాలు అందించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, జెడ్పీటీసీ బత్తిని అరుణ, కరీంనగర్ జెడ్పీ చైర్‌పర్సన్ విజయ ఉన్నారు.

నృసింహుడి సన్నిధికి పోటెత్తిన భక్తులు



ధర్మపురి దేవాలయంలో భక్తుల క్యూలైను

ధర్మపురి: ధర్మపురి నృసింహస్వామి ఆలయం ఆదివారం భక్తజన సంద్రంగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం ఆలయాల్లో మొక్కులు సమర్పించుకున్నారు.

రాములోరి అక్షింతల శోభాయాత్ర



యూసుఫ్‌నగర్‌లో అక్షింతలతో భక్తులు

కోరుట్ల రూరల్: మండలంలోని యూసుఫ్‌నగర్‌లో అయోధ్య శ్రీరాముని అక్షింతల శోభాయాత్రను ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని హనుమాన్ ఆలయంలో పూజలు నిర్వహించి శివాలయం వరకు శోభాయాత్ర చేపట్టారు. సర్పంచ్ గుగ్గిళ్ల తుక్కారాంగౌడ్, మాజీ సర్పంచ్ తుక్కయ్య, ఆనంద్, శ్రీనివాస్, శిరీష్, హరికృష్ణ, రాజశేఖర్, అన్వేశ్ ఉన్నారు.

న్యూఇయర్ సందడి



జగిత్యాలటౌన్/రాయికల్: న్యూ ఇయర్‌ను పురస్కరించుకుని ఆదివారం జిల్లాలోని స్వీట్‌షాపులు, బేకరీలు, చికెన్ సెంటర్లు కిటకిటలాడాయి. షాపులు స్పెషల్ ఆఫర్లు ప్రకటించడంతో కేక్స్, కూల్‌డ్రింక్స్, ఫుడ్ ఐటెమ్స్‌కు డిమాండ్ ఏర్పడింది. పాఠశాలలు, కళాశాలలు వేడుకలు నిర్వహించి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నాయి.



కేకులు కొనుగోలు చేస్తూ..

యువతా.. మీదే భవిత

- కొత్త సంవత్సరం కావాలి నవ నూతనం..
- ప్రథమస్థానం.. ఉత్తమ గమ్యాలే లక్ష్యం
- వ్యాయామమే మహా ఆరోగ్యం
- అవినీతి అంతం.. అదే మన పంతం



కరీంనగర్ అర్బన్: వేడుకగా 2023 సంవత్సరానికి ముగింపు పలుకుతూ.. కొంగొత్త ఆశలతో 2024లోకి అడుగిడాం. గడిచిన ఏడాది పలువురికి విజయాన్ని అందించగా.. మరికొంతమందికి అపజయాలు మిగిల్చింది. వ్యవసాయం పండగని కొందరు యువత నిరూపించగా రాజకీయాల్లో ఎందుకు రాణించలేమంటూ మరికొందరు ఉత్సాహం చూపుతున్నారు. కొలువుల్లో దూకుడు తగ్గని యువత, విద్యాహబ్‌గా పేరున్న కరీంనగర్ పేరు నిలబెడతామని విద్యార్థిలోకం ఉవ్విళ్లూరుతోంది. ఈ నేపథ్యంలో అపజయాలను లెక్క చేయక.. విజయానందాన్ని గర్వించకుండా ముందుకు వెళ్లాల్సిన అవశ్యకత ఎంతైనా ఉంది. జ్ఞాపకాలు పదిలం చేసుకొని.. లక్ష్యాలు సాకారం చేసుకొని.. గతేడాదికి వీడ్కోలు చెబుతూ..సరికొత్తగా సాగాల్సిన తరుణమిది. దేశ జనాభాలో అత్యధిక భాగం యువతే కావడం విశేషం. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనూ వారిదే సింహభాగం.

ప్రథమ స్థానమే లక్ష్యం

చేసేవృత్తి, ఎంచుకున్న రంగం, ఉద్యోగం, విద్యార్థి.. యజమాని, శ్రామికుడు.. నాయకుడు, కార్యకర్త ఏదైనా సరే. అందరిలో ఒకటే లక్ష్యం కావాలి. అది ప్రథమస్థానంలో నిలవడం. చేసే పనిలో మనమే ప్రథమంగా నిలవాలనే తపనతో ముందుకు సాగితే విజయం వీడకుండా అంటిపెట్టుకుని ఉంటుంది. అందుకు వర్తమాన అంశాలు, సమాజ స్థితిగతులు, మానవ జీవన విధానంలో చోటు చేసుకుంటున్న మార్పులను ఎప్పటికప్పుడు గమనించాలి.

ఉత్తమ గమ్యాలు

పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ఆరోగ్యంగా ఉన్నట్లే. స్వచ్ఛ భారత్ స్ఫూర్తిగా అనేక కార్యక్రమాలు చేపట్టాం. కరీంనగర్ స్మార్ట్‌సిటీ నేపథ్యంలో ప్రజల పాత్ర కీలకం. నగరంలో రోజుకు 220 మెట్రిక్ టన్నుల చెత్త సేకరణ జరుగుతోంది. ఇందులో ప్లాస్టిక్ అత్యధికం. ఇదే కొనసాగితే పర్యావరణం దెబ్బతింటుంది. ప్లాస్టిక్ వాడకుండా ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించి ఆచరించడం ఉత్తమం.

వ్యాయామమే మహారోగ్యం

ఆరోగ్యమే మహాభాగ్యం మాట నవనూతనం. ఆరోగ్యకరమైన యువత దేశానికి అవసరం. అందుకే జీవన శైలిలో మార్పులు అత్యవసరం. శారీరక శ్రమ లోపించడంతో ఊబకాయం, బుద్ధిమాంద్యం తలెత్తుతోంది. అమెరికా వంటి దేశాల్లో యువత శరీర బరువు తగ్గేలా నిరంతరం వ్యాయామం చేస్తుంటారు. శారీరక శ్రమ లేకపోతే మానసిక ఆందోళన పెరుగుతుంది. ఉదయం నడక, వ్యాయామం, యోగా, ధ్యానం వంటివి అలవాటు చేసుకోవడం అనివార్యం. సమయానికి తిండి, నిద్ర ప్రాధాన్యం తెలుసుకుంటే ఉదయం వేళ హుషారు, మానసిక ఉత్తేజం తప్పకుండా లభిస్తుంది.

స్మార్ట్‌గా వ్యవహరిద్దాం

సెల్‌ఫోన్.. ప్రతి వ్యక్తి జీవితంలో కీలకం. మనిషికి సేవ చేసేందుకు వచ్చి శాసిస్తోంది. స్మార్ట్‌ఫోన్‌కు బానిస కాకుండా బాధ్యతగా వినియోగించాలి. ప్రధానంగా సామాజిక మాధ్యమాల్లో అప్రమత్తంగా వ్యవహరించాలి. వివాదాలకు, పుకార్లకు దూరంగా వ్యవహరించాలి. అంతేకాదు చిన్నారులు, యువత సెల్‌ఫోన్‌లో గేమ్‌లకు వ్యసనపరులు కాకుండా చూడాల్సిన బాధ్యత పెద్దలపై ఉంది.

క్షేమంగా గమ్యం

విలువైన ప్రాణం ప్రమాదంలో పోరాదు. అతివేగం.. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్.. వేకువజామున ప్రయాణం.. వీటికి తోడు హెల్మెట్ లేకుండా వాహనం నడపొద్దని ప్రతిజ్ఞ చేసుకోవాలి. గతేడాది ఉమ్మడి జిల్లాలో 200మందికి పైగా మరణించగా 500లకు పైగా గాయపడ్డారు. ఈ సంఘటనలు మనకు ప్రయాణ పాఠం బోధిస్తున్నాయి. జాగ్రత్తగా వ్యవహరిస్తూ క్షేమంగా గమ్యం చేరాలి.

అవినీతి అంతం.. అదే మన పంతం

దేశ ప్రగతికి అవినీతి పెద్ద జాడ్యం. జిల్లాలో ప్రతి ఏటా పదుల సంఖ్యలో అవినీతి నిరోధక శాఖ కేసులు నమోదు చేస్తోంది. అవినీతి అధికారులు, ఉద్యోగుల భరతం పట్టాలి. అప్పుడు రాజ్యాంగం కల్పించిన హక్కులను స్వేచ్ఛగా పొందే అవకాశముంటుంది.

మానవత్వ పరిమళం

మనిషిగా జీవించాలి. స్వార్థం మానవ ఆలోచన వీడాలి. జీవితం నేరపూరితం కారాదు. ఆలోచన విధానం మారాలి. మనతోపాటు పిల్లల్లో చెడు ఆలోచనలకు చోటివ్వకుండా కావాల్సిన జాగ్రత్తలు తీసుకుంటే మనసంతా మానవత్వమే. గతంలో 21హత్యలు, 34అత్యాచార సంఘటనలు చోటుచేసుకున్నాయి. దోపిడీ, మోసాల సంఖ్య చెప్పలేనంతగా నమోదు.. ఇది మనిషి జీవితానికి మచ్చగా పరిగణించాల్సిందే.

ఉపాధికి ఊతం

యువత అత్యధికంగా ఉండటమే కాదు నిరుద్యోగం ఎక్కువే. 2లక్షలకు పైగా ఉద్యోగాల కోసం వేచిచూస్తుంటే.. అర్హతకు తగిన పని లేక దొరికిన దాంతో అసంతృప్తితో కాలం వెళ్లదీస్తున్నారు. పారిశ్రామిక రంగం విస్తరిస్తే ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి. ఐటీ హబ్‌గా జిల్లాను మరింత తీర్చిదిద్దాల్సిన అవసరముంది.

ఆత్మహత్య వద్దే వద్దు

ఆత్మహత్య చేసుకునే ధైర్యం ఉంటే ఎంతటి కష్టమైన ఎదుర్కొవచ్చని చెబుతారు. అలాంటప్పుడు ఆ ఆలోచన వద్దు. గత సంవత్సరం వివిధ కారణాలతో 112 మంది ఆత్మహత్యకు పాల్పడటం విచారకరం. ఒక్క క్షణం ఆలోచిస్తే సమస్యకు పరిష్కారం దొరకవచ్చు.

బద్ధకాన్ని జయిద్దాం

ఆ పనా.. వామ్మో నాతో కాదు. ఇది మరీ కష్టంలే. అనే మాటలు వద్దు. అనుకుంటే సాధించలేనిది ఏముంది. చరిత్రను చూస్తే ఎన్నో విజయగాథలు.. పని వాయిదా వేసే దోరణిలో అమూల్యమైన అవకాశాలను చేజార్చుకోవడం చూస్తుంటాం. బద్ధకం వీడితే ఉజ్వల భవిత సొంతం అవుతుందనే ఆశాభావంతో ముందుకెళ్తే తప్పకుండా కొత్త మార్గం కనిపిస్తుంది.

జిల్లాల వారీగా యువత సంఖ్య

కరీంనగర్	3,54,086
రాజన్న సిరిసిల్ల	2,08,422
పెద్దపల్లి	2,25,098
జగిత్యాల	2,34,765





కొత్త ఆశలతో ముందుకు..

చూస్తుండగానే 2024 రానే వచ్చింది. పాత ఏడాది బాగానే జరిగింది.. కొత్త ఏడాది కూడా అలాగే సాగుతుందన్న ఆకాంక్ష అందరిలోనూ ఉంది. ఈ క్రమంలో ఒక్కొక్కరు ఒక్కో విధంగా ముందుకు కదులుతుంటారు. పక్కా ప్రణాళిక రూపొందించుకుంటారు. అలాగే మన జిల్లా బాస్‌లు కూడా తమతమ ప్రాధమ్యాలను వివరించారు. – జగిత్యాల/జగిత్యాలటౌన్

లబ్ధిదారులందరికీ సంక్షేమ పథకాలు



ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకుంటాం. ఆరు గ్యారంటీల పథకాలను లబ్ధిదారులకు చేరవేస్తాం. ఇప్పటికే ప్రజాపాలన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నాం. ప్రతి పనినీ ముందుకు తీసుకెళ్తా జిల్లాను అగ్రగామిగా నిలిపేలా చూస్తాం. ప్రణాళిక ప్రకారం ముందుకెళ్తూ జిల్లా అభివృద్ధికి కృషి చేస్తాం.

– కలెక్టర్ యాస్మిన్ బాషా

మాస్టర్‌ప్లాన్ అమలుకు కృషి



జగిత్యాల జిల్లా వ్యవసాయాధారితం. విద్యుత్, సాగునీరు సక్రమంగా వచ్చేలా చూస్తా. జిల్లాకేంద్రం అభివృద్ధే ధ్యేయంగా ముందుకెళ్తా. మాస్టర్ ప్లాన్ అమలు చేసేలా చూస్తా. అధికార పార్టీకి సహకరిస్తూ.. అభివృద్ధికి తోడ్పడతా. జిల్లా కేంద్రంలో అండర్ డ్రైయినేజీ ఏర్పాటుకు ప్రయత్నిస్తా. నిత్యం ప్రజల్లో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తా.

– ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

గర్భిణులకు మెరుగైన సేవలు



కొత్త సంవత్సరంలో ఈ లోకానికి పరిచయం కాబోతున్న చిన్నారులు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండేలా గర్భిణులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందిస్తాం. తల్లుల సంపూర్ణ ఆరోగ్యంతోనే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చన్న మహాత్ముల మాటల్ని నిజంచేసేలా కొత్త సంవత్సరాన్ని ప్లాన్ చేసుకుని ఆ దిశగా ముందుకు సాగుతాను.

– పద్మారాథోడ్, గైనకాలజిస్ట్

ఆర్థిక స్వావలంబన సాధించేలా కృషి



కొత్త జనరేషన్‌కు నచ్చేలా దుస్తుల రూపకల్పన చేస్తాను. దుస్తుల డిజైనింగ్, మేకింగ్‌లో మక్కువ ఉన్న యువతకు శిక్షణ ఇచ్చి ప్రొఫెషనల్స్‌గా తయారు చేస్తున్నాను. డిజైనింగ్‌లో మెలకువలు నేర్పించి వారు సొంతంగా ఎదిగేలా ప్రోత్సహిస్తున్నాం. యువతులు, మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలన్న లక్ష్యంతో నూతన సంవత్సరాన్ని ప్రారంభిస్తా.

– ప్రణీత, ఫ్యాషన్ డిజైనర్, బోటిక్ నిర్వాహకురాలు

విజయానికి పక్కా ప్రణాళిక



నెట్టింట మేం రూపొందించిన రీల్స్ ఎంతో మందిని ఆకట్టుకున్నాయి. మున్ముందు నా భర్త రాకేష్‌తో కలిసి మరిన్ని మంచి రీల్స్ రూపొందించి వ్యూయర్లను ఆకట్టుకునేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తాం. కొత్త ఏడాదిలో ఇదే రంగంలో పూర్తిస్థాయిలో విజయం సాధిస్తాం.

– మేఘన, రీల్స్ యాక్టర్, కోరుట్ల

అభివృద్ధికి బాటలు



కొత్త సంవత్సరంలో పూర్తి చేయాల్సిన అభివృద్ధి పనుల ప్రణాళిక సిద్ధం చేసుకున్నా. కోరుట్ల, మెట్‌పల్లిలో పార్కులు, పిక్నిక్ స్పాట్ల ఏర్పాటుకు ప్రయత్నిస్తా. ఐటీ హబ్‌లు విస్తరించే ఏర్పాటు చేసి యువత ఉపాధి కల్పిస్తా. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండేలా ప్రణాళిక రూపొందించుకున్న.

– కల్వకుంట్ల సంజయ్, ఎమ్మెల్యే, కోరుట్ల

ప్రజలు సుఖశాంతులతో ఉండాలి



ప్రజలంతా కొత్త సంవత్సరంలో సుఖశాంతులతో ఉండాలి. పాత సంవత్సరానికి ముగింపు పలికి.. కొత్త సంవత్సరంలోకి అడుగిడుతున్న సందర్భంగా ప్రజలంతో సంతోషంగా ఉండాలి. అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

– ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

జీఎస్టీ పేరిట ప్రజలపై పన్నుల భారం



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ.

జగిత్యాలటౌన్: జీఎస్టీ పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై మోపుతున్న పన్నుల భారం తగ్గించాలని, చిరు వ్యాపారులకు ప్రోత్సాహం అందించాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కోరారు. జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్‌లో ఆదివారం చాంబర్ ఆఫ్ కామర్స్ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. క్రూడాయిల్ ధర బ్యారెల్‌కు 105 డాలర్లున్నప్పుడు లీటర్ డీజిల్ రూ.50, పెట్రోల్ రూ.70 ఉండేదని, ఇప్పుడు బ్యారెల్‌కు 85డాలర్లు కాగా డీజిల్ మాత్రం రూ.100, పెట్రోల్ రూ.110గా ఉందని పేర్కొన్నారు.

గ్రామ పంచాయతీ ఏర్పాటు చేయాలి

బీర్‌పూర్ మండలం మంగేళ నుంచి గోండు గ్రామాన్ని విడదీసి ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని ఆ గ్రామస్తులు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్సీకి గ్రామస్తులు వినతిపత్రం అందించారు. మంగేళకు గూడెం మూడు కిలోమీటర్ల దూరం ఉంటుందన్నారు. తమకు న్యాయం చేయాలని కోరారు.

భక్తజనమంతా.. దొంగ మల్లన్న చెంత





- సెలవు దినం కావడంతో పోటెత్తిన భక్తజనం
- బోనాలు తీసి నైవేద్యం సమర్పించిన భక్తులు

గొల్లపల్లి: మండలంలోని మల్లన్నపేట శ్రీమల్లికార్జున స్వామి (దొంగ మల్లన్న) స్వామి ఆలయం ఆదివారం భక్తజన సంద్రంగా మారింది. సెలవుదినం కావడంతో భక్తులు కిక్కిరిసిపోయాయి. ఉదయమే ఆలయానికి చేరుకున్న భక్తులు బోనాలు చేసి స్వామివారికి నైవేద్యం సమర్పించారు. ఆలయ అర్చకులు రాజేందర్, రఘునందన్ పూజలు చేశారు. భక్తుల ద్వారా రూ.56,090 ఆదాయం వచ్చినట్లు ఫౌండర్ ట్రస్టీ శాంతయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సిద్ధంకి నర్సయ్య, మల్లారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు గోస్కుల రాజన్న, మాజీ సర్పంచ్ బీమ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



అడ్లూరి, జీవన్‌రెడ్డి తులాభారం

గొల్లపల్లి: మండలంలోని మల్లన్నపేట మల్లికార్జున స్వామిని ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి దర్శించుకున్నారు. అర్చకులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. మల్లన్నకు పూజలు చేసిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఎత్తు బంగారం ఇచ్చారు. గ్రంథాలయ మాజీ చైర్మన్ కటారి చంద్రశేఖర్ రావు, సర్పంచ్‌లు సిద్దంకి నర్సయ్య, నిశాంత్ రెడ్డి, చిర్ర గంగాధర్, రాజ్యలక్ష్మి తిరుపతి రెడ్డి, వెంకటపద్మ, మాజీ సర్పంచ్ బీమ సంతోష్, నేరెల్ల మహేశ్, బుచ్చిరెడ్డి, గంగాధర్, ఉమేశ్ పాల్గొన్నారు.



అదుపుతప్పి లారీ బోల్తా

మెట్‌పల్లిరూరల్: ఇసుక లోడ్‌తో వెళ్తున్న ఓ లారీ అదుపుతప్పి బోల్తా పడగా డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు. ఈ ఘటన ఆదివారం మెట్‌పల్లి పట్టణ శివారులో జరిగింది. కాళేశ్వరం నుంచి నిజామాబాద్ వైపు ఇసుక లోడ్‌తో వెళ్తున్న లారీ వెంకట్రావుపేట వద్దకు రాగానే అదుపుతప్పింది. దీంతో పక్కనే ఉన్న కల్వర్టులో బోల్తా పడింది. ఇది గమనించిన స్థానికులు వెంటనే క్యాబిన్‌లో నుంచి డ్రైవర్‌ను బయటకు తీశారు. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. విషయం తెలుసుకున్న మెట్‌పల్లి పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.



కల్వర్టు వద్ద బోల్తా పడిన లారీ

25 ద్విచక్ర వాహనాలు పట్టివేత

మెట్‌పల్లి: పట్టణంలో ఆదివారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా నంబర్ ప్లేట్ లేని 25 వాహనాలను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వాహనదారులు అన్నిరకాల ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలని ఎస్సై చిరంజీవి తెలిపారు.



పోలీసులు పట్టుకున్న వాహనాలు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



గాయపడిన సిద్ధు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం మారుతీనగర్ శివారులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పెద్దాపూర్‌కు చెందిన సిద్ధు, మారుతినగర్‌కు చెందిన వంశీ గాయపడ్డారు. ఇద్దరూ కలిసి కోరుట్ల వైపు నుంచి మెట్‌పల్లి వైపు ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. ప్రమాదం జరగడంతో కింద పడ్డారు. గాయపడిన ఇద్దరిని 108వాహనంలో మెట్‌పల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరిలో సిద్ధు పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్ తరలించారు. ప్రమాదానికి కారణాలు తెలియాల్సి ఉంది.

పశువుల కొట్టం దగ్ధం

- రూ.4 లక్షల ఆస్తి నష్టం

రాయికల్: మండలంలోని బోర్నపెల్లిలో భారతపు లక్ష్మీనర్సయ్యకు చెందిన పశువుల కొట్టం ఆదివారం ప్రమాదవశాత్తు నిప్పంటుకుని దగ్ధమైంది. ఘటనలో 1400 గడ్డి కట్టలు, హార్వెస్టర్, ట్రాక్టర్ పనిముట్లు, కలప కాలిపోయింది. స్థానికులు జగిత్యాల ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. వాహనం సకాలంలో రాకపోవడంతో స్థానికులందరూ కలిసి మంటలను ఆర్పివేశారు. ప్రమాదంలో మొత్తంగా రూ.4లక్షల నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపారు.

బావిలో పడి ఒకరి మృతి



మల్లయ్య (ఫైల్)

మేడిపల్లి: మండలంలోని వెంకట్రావుపేటకు చెందిన కానుగంటి మల్లయ్య (58) ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి మృతిచెందాడు. మల్ల య్య శనివారం రాత్రి వ్యవసాయ పనులకు వెళ్లాడు. తిరిగి రాకపోయేసరికి బంధువులు, గ్రామస్తులు వెదికారు. ఆదివారం ఉదయం ఓ వ్యవసాయ బావిలో శవమై కనిపించాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడికి భార్య, ముగ్గురు ఆడ పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.